సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 6 । ఆగస్టు । 2024



అప్రమత్తతతో ఆపద దూరం

వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వాహనదారులు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చు.

- 8లో ▸



ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

జిల్లాలోని అర్హులైన రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ డిమాండ్ చేశారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.7 /23.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎస్‌ఎల్‌ఆర్ ఏడీగా అశోక్



సుభాష్‌నగర్ : జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా అశోక్ సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించిన శ్రీనివాసులు హన్మకొండకు బదిలీ అయ్యారు. అశోక్ కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు వచ్చారు. అలాగే కార్యాలయ సూపరింటెండెంట్‌గా హైదరాబాద్ నుంచి వచ్చిన జగదీశ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ప్రధానకార్యదర్శి నేతికుంట శేఖర్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖాధికారి బాధ్యతల స్వీకరణ



డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా ఉద్యాన శాఖాధికారిగా బండారి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మొన్నటి వరకు ఇక్కడ పని చేసిన మధుసూదన్ ఖమ్మం జిల్లాకు బదిలీగా కాగా, ఆయన స్థానంలో నూతన అధికారిగా శ్రీనివాస్ నియామకం అయ్యారు. అధికారికి శాఖ ఉద్యోగులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యాన, పట్టుపరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 16 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 503 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1080.20(45.24 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

టీబీ పరీక్ష చేయాలి



వర్ని : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు టీబీ పరీక్ష చేయాలని జిల్లా క్షయ నిర్మూలన అధికారి దేవీ నాగేశ్వరి సూచించారు. మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ప్రాథమిక కేంద్రానికి వచ్చిన వారిని టీబీ లక్షణాలు గురించి అడగాలన్నారు. ఎవరైన దగ్గుతో బాధ పడితే పరీక్షలు చేయాలని సూచించారు. మోస్రా మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్, జిల్లా టీబీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, ఘనరాజ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెనూ పాటించాలి



మోపాల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, ఈ విషయంలో రాజీ పడేదిలేదని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని కులాస్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. జిల్లాలో 1,164 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఉన్నాయని, 2,304 మంది కుక్‌లు, హెల్పర్లు ఉన్నారన్నారు. పాఠశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వనిత పాల్గొన్నారు.





నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో బారులు తీరిన భక్తులు

ఆలయాలకు శ్రావణశోభ

శ్రావణ మాసం ప్రారంభమవడంతో జిల్లా కేంద్రంలోని ఆలయాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. సోమవారం ఉదయం నుంచే భక్తులు శివాలయాల్లో బారులు తీరారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పరమేశ్వరుడికి అభిషేకాలతో పాటు బిల్వపత్రాలను సమర్పించారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, నగరేశ్వరాలయం, మనో కామేశ్వరాలయం, శంభు లింగేశ్వర ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

– నిజామాబాద్ అర్బన్



నీలకంఠేశ్వర ఆలయంలో శివలింగం

డీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్

- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటన
- ఇద్దరు నామినేషన్ వేయడంతో నాటకీయ పరిణామాలు
- రాజకీయ పెద్దల జోక్యంతో నామినేషన్ ఉపసంహరించుకున్న సాయన్న



తారాచంద్‌నాయక్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి రామ్మోహన్

సుభాష్‌నగర్ : ఇందూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్‌గా డిచ్‌పల్లి మండలం రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నగరంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ రిజిస్ట్రార్ రామ్మోహన్ వ్యవహరించారు. కామారెడ్డి జిల్లా గాంధారి సొసైటీ చైర్మన్ సాయన్న, రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్ నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి నుంచి ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తారాచంద్ నాయక్ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ.. సామాజిక సమీకరణలో భాగంగా చివరి క్షణంలో సాయన్న తెరపైకి వచ్చారు. ఒక దశలో కామారెడ్డి వర్సెస్ నిజామాబాద్ జిల్లాగా అధికార పార్టీ డైరెక్టర్లు విడిపోయారు. బీఆర్‌ఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి సాయన్నకు మద్దతుగా నిలిచారు. నిజామాబాద్ జిల్లా కమలాపూర్‌కు చెందిన న్యాస రాజేశ్వర్ సాయన్నను ప్రతిపాదించడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

రాజకీయ పెద్దల జోక్యంతో..

డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక విషయంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఎన్నికల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు చర్చించారు. తారాచంద్, ఇంద్రసేనారెడ్డి పేర్లు తెరపైకి రాగా, డీసీసీబీ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు ఒకే సామాజికవర్గానికి ఇస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ఎస్టీకి అవకాశం కల్పించాలని భావించారు. కానీ ఆఖరు క్షణంలో అధికార పార్టీ డైరెక్టర్లు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. నామినేషన్ల స్క్రూటినీ తర్వాత సుదర్శన్‌రెడ్డి ఇంటికి వెళ్లి మంతనాలు సాగించారు. సుదర్శన్‌రెడ్డి షబ్బీర్ అలీకి ఫోన్ చేసి సాయన్న నామినేషన్ ఉపసంహరించుకోవాలని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు నామినేషన్ ఉప సంహరించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది.

సాయన్న తప్పుకోవడంతో ఏకగ్రీవం

పోటీ నుంచి సాయన్న తప్పుకోవడంతో చైర్మన్‌గా తారాచంద్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామ్మోహన్ ప్రకటించారు. అనంతరం ఆయనకు ఎన్నికైనట్లు ధ్రువపత్రం అందజేశారు. దీంతో వైస్ చైర్మన్‌గా ఏదుళ్ల ఇంద్రసేనారెడ్డి కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఐడీసీఎంఎస్ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది తారాచంద్ నాయక్‌ను సన్మానించారు.

అనంతరం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గిరిజన, ఆదివాసీ చైర్మన్ కెతావత్ యాదగిరి, సీనియర్ నాయకులు చంద్రునాయక్, శంకర్, అమ్రాబాద్ రవి, రాజునాయక్, తుకారాం నాయక్, బాల్‌రాజ్, చందర్ నాయక్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

రెండు పదవులు ఒకే జిల్లాకు..

ఉమ్మడి జిల్లాతోపాటు జిల్లాల విభజన తర్వాత కూడా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు రెండూ సుమారు 20 ఏళ్ల తర్వాత నిజామాబాద్ ప్రాంతానికి దక్కాయి. టీడీపీ హయాంలో డీసీసీబీ చైర్మన్‌గా వీజీ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్‌గా అరికెల నర్సారెడ్డి కొనసాగారు. ఆ తర్వాత కొనసాగిన ఎడ్ల రాజిరెడ్డి (కామారెడ్డి) డీసీసీబీ చైర్మన్‌గా, మునిపల్లి సాయిరెడ్డి (నిజామాబాద్) డీసీఎంఎస్ చైర్మన్, గంగాధర్‌రావు పట్వారీ (నిజామాబాద్), ముజీబొద్దీన్ (కామారెడ్డి), ఈ పాలకవర్గంలో పోచారం భాస్కర్ రెడ్డి (కామారెడ్డి) డీసీసీబీ చైర్మన్‌గా, సాంబారు మోహన్ (నిజామాబాద్) డీసీఎంఎస్ చైర్మన్‌గా కొనసాగారు. పాలకవర్గం పదవీకాలం ఆరు నెలలే ఉన్నప్పటికీ.. ఒకే జిల్లా నుంచి డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు ఎన్నిక కావడం విశేషంగా చెప్పొచ్చు.

మరింత బలోపేతం చేస్తా..



సుభాష్‌నగర్ : డీసీఎంఎస్‌ను మరింత బలోపేతం చేస్తానని నూతన చైర్మన్ తారాచంద్ నాయక్ పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఆయన మాట్లాడారు. పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు మండవ వెంకటేశ్వర్‌రావు, తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఉమ్మడి జిల్లా పదవికి గిరిజనుడినైన తనను ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే బడుగు, బలహీనవర్గాల పార్టీ అని మరోసారి రుజువైందన్నారు. ఎన్నికైన అనంతరం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వైస్‌చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, రాజు గౌడ్, కపిల్‌రెడ్డి, న్యాస రాజేశ్వర్, బిజినెస్ మేనేజర్ నగేష్ పాల్గొన్నారు.

తాగునీటిపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రాకాసీపేట్‌లో ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు

బోధన్ టౌన్ : బోధన్ పట్టణ ప్రజలకు సరఫరా చేసే తాగునీటి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి ఆయన పట్టణంలోని పర్యటించారు. రాకాసీపేట్‌లోగల వాటర్ ఫిల్టర్‌బెడ్‌లో తాగునీటి శుద్ధి విధానాన్ని, పంప్‌హౌస్ పనితీరును పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని సూచించారు. జనాభా అవసరాలకు అనుగుణంగా పంప్‌హౌస్ నిర్మాణంతో పాటు రాకాసీపేట్, శక్కర్‌నగర్, రెంజల్ బేస్ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ఎక్కడా పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలని, ప్రతీరోజు వాటర్ టెస్టింగ్ జరపాలని సూచించారు. ట్యాంక్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. మున్సిపాలిటీలో తాగునీటి వ్యవస్థ కోసం రూ.3 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అనంతరం పట్టణంలోని జాతీయ జెండాను ఏర్పాటు చేయడానికి అంబేడ్కర్ చౌరస్తాలోగల అమరవీరుల స్థూపం సమీపంలో స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాకేశ్, తహసీల్దార్ విఠల్, ఏఈ శ్రీనివాస్, ఏజీపీ గౌసొద్దీన్, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్‌లు శరత్‌రెడ్డి, మీర్ నజీర్ అలీ, శ్రీకాంత్ గౌడ్, ధూప్‌సింగ్, పౌల్, నాయకులు పాషా మొయినొద్దీన్, గడుగు గంగాధర్, రామ్మోహన్, శ్రీనివాస్, దామోదర్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నందిపేటలో మొక్క నాటుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నందిపేట్ : ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. నందిపేట్‌లోని కేజీబీవీ పాఠశాల, కళాశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరగడంతో శుభ్రం చేయించి మొక్కలు నాటించాలని ఆదేశించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఆలోపు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల ఆవరణలను శుభ్రం చేయించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాల ప్రవేశంలోనే మెనూ బోర్డును ఏర్పాటు చేయాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ శాంతి కుమారిని ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ అయిలాపూర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. కొత్త భవనం ప్రతిపాదనల గురించి పంచాయతీరాజ్ శాఖ ఈఈ దేవిదాస్‌ను ఆరా తీశారు. నందిపేట్–నిజామాబాద్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న ఉపాధి హామీ కూలీలను పలకరించారు. వారితో కలిసి కలెక్టర్ మొక్క నాటారు. ప్రతి రోజు కూలి ఎంత వస్తోందని ప్రశ్నించగా, సగటున రూ.200 వరకు గిట్టుబాటు అవుతోందని కూలీలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు మంజూరు చేయిస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జగన్నాథచారి, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీపైనే భరోసా

- సెప్టెంబర్ 17లోగా గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని గతంలో ప్రకటించిన సీఎం
- గల్ఫ్ బోర్డు, ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలుపై జేఏసీ ప్రతినిధుల విజ్ఞప్తి



అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా సీఎంను కలిసిన గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ బోర్డు ఏర్పాటు అంశం అసెంబ్లీలో చర్చకు రాకపోవడం, వలస కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర నిరాశతో ఉన్న జేఏసీ ప్రతినిధులు మరోసారి సీఎం రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి తమ ఆకాంక్షలకు ప్రతిరూపం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 17లోగా తెలంగాణలో గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి తీరుతామని ముఖ్యమంత్రి స్వయంగా గతంలో వెల్లడించిన ప్రకటనను దృష్టిలో ఉంచుకుని ఆయన మాటపైనే భరోసాతో వలస కార్మికులు ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిపోవడం, సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లే ముందు సచివాలయంలో జేఏసీ బృందం స్వయంగా కలుసుకుంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ, సీఎం ప్రకటన తదితర విషయాలను జేఏసీ ప్రతినిధులు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లారు. అసెంబ్లీ సమావేశాలలో గల్ఫ్ బోర్డు అంశంపై చర్చ లేకపోవడం, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుపకపోయినా గతంలో ఇచ్చిన హామీని సీఎం గుర్తుంచుకోవాలని నాయకులు విన్నవించారు. వలస కార్మికుల కోసం రూ.500 కోట్ల నిధులను వెచ్చించాలని కోరారు. గల్ఫ్ దేశాల్లో ఏ కారణం చేతనైనా మరణించిన తెలంగాణ వలస కార్మికుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ప్రవాసీ విధానంతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన సీఎం తన అమెరికా పర్యటన ముగిసిన తరువాత ఉన్నత స్థాయి సమీక్షను నిర్వహించి వలస కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా వలస కార్మికుల చిరకాల స్వప్నమైన గల్ఫ్ బోర్డు ఏర్పాటు సీఎం నిర్ణయంపై ఆధారపడి ఉంది.

విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు

- జాతీయ సాధన సర్వేలో మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులకు శిక్షణ



వేల్పూర్‌లో శిక్షణ శిబిరంలో చార్టులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

కమ్మర్‌పల్లి : పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాల పెంపునకు అధికారులు చర్యలు చేపట్టారు. 2017, 2021 సంవత్సరాల్లో జరిగిన జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)లో జిల్లా విద్యార్థులు వెనుకబడినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కనీస అభ్యసన సామర్థ్యాలను కూడా సాధించలేకపోయారు. నవంబర్‌లో నిర్వహించే జాతీయ సాధన సర్వే(ఎన్‌ఏఎస్, న్యాస్) పరీక్షలో ఉన్నతమైన ఫలితాలను సాధించడానికి విద్యాశాఖ నడుం బిగించింది. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్‌లు పాఠశాల సముదాయ సమావేశాల్లో టీచర్లకు శిక్షణ అందిస్తున్నారు.

కనీస అభ్యసన స్థాయిల మెరుగు కోసం..

ప్రాథమిక విద్యా వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల జిల్లాలో దాదాపుగా 900 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. ప్రతి ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంను నియమించడంతో పర్యవేక్షణ పెరిగింది. జిల్లాలోని ఖాళీలను త్వరలో డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం పాఠశాల సముదాయ సమావేశాల్లో జాతీయ సాధన సర్వేపై ఉపాధ్యాయులను సంసిద్ధులను చేయనున్నారు. నవంబర్‌లో ఎన్‌ఏఎస్(న్యాస్) పరీక్షను మూడు, ఆరు, తొమ్మిదో తరగతులకు నిర్వహించనున్నారు. లాంగ్వేజ్‌లు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రంలో పరీక్ష పెట్టనున్నారు. ఉపాధ్యాయులకు బోధన ప్రణాళిక, బోధన పద్ధతులు, పాఠ్య పుస్తక పూర్తి వినియోగం, విద్యార్థుల హాజరు, పర్యవేక్షణ, న్యాస్ పరీక్షా విధానం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

గత న్యాస్ నివేదికలో వెనుకబాటు

ప్రాథమిక స్థాయిలో 3, 5, 8, 10 తరగతులకు సంబంధించి 2021లో నిర్వహించిన సర్వేలో జిల్లా వెనుకబడింది. మూడో తరగతిలో రాష్ట్రంలో 28వ స్థానం, ఐదో తరగతికి సంబంధించి 27వ స్థానం, 8వ తరగతికి సంబంధించి 16వ స్థానం, పదో తరగతికి సంబంధించి సామర్థ్యాల పరంగా జిల్లా 17వ స్థానం పొందింది. ఉన్నత పాఠశాలల్లో కనీస అభ్యసన స్థాయిల్లో ఫలితాలు కొంత బాగున్నా ప్రాథమిక పాఠశాల స్థాయిలో అధ్వానంగా ఉన్నాయి. చాలా మంది విద్యార్థులు ఆంగ్లంలో వాక్యాలను చదివి అర్థం చేసుకోలేకపోతున్నారు. ఉపాధ్యాయుల కొరత, వసతులు లేకపోవడం తదితర అంశాలు న్యాస్ ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయి.

తరగతికి ఒకరిని నియమించాలి



ప్రాథమిక స్థాయిలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే జాతీయ సాధన సర్వేలో ఉన్నతమైన ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయి. అలాగే బోధనను మెరుగుపరుచుకోవడానికి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి.

– అంకం నరేశ్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్‌

నిజామాబాద్‌ అర్బన్‌: సిరికొండ మండలం కొండాపూర్‌ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మజను సస్పెండ్‌ చేస్తూ డీఈవో దుర్గాప్రసాద్‌ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో ఆమెను మొదట ఇదే మండలంలోని కొండూర్‌ పాఠశాలకు కేటాయించారు. ఆ ప్రాంతాన్ని రద్దు చేస్తూ కొండాపూర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. సదరు టీచర్‌ బదిలీ ఉత్తర్వులను లెక్క చేయకుండా కొండూరు నుంచి రిలీవ్‌ కాలేదు. తనకు అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ సంఘం నాయకులతో ఆమె డీఈవోపై ఆరోపణలు చేశారు. నిబంధనల ప్రకారమే ఆమెకు పాఠశాల కేటాయించినా రిలీవ్‌ కాకపోవడంతో సస్పెండ్‌ చేశారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



నందిపేట్‌ (ఆర్మూర్‌): జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో మండల కేంద్రంలోని న్యూ లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. జిల్లా కేంద్రంలోని అర్సుల్‌ రాజారాం స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ 100మీటర్ల పరుగు పందెం అండర్‌ –16 విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు సిద్ధునాయక్‌, శ్రీనిధిరెడ్డి కాంస్య పతకాలు సాధించారని కరస్పాండెంట్‌ అరుణ్‌, ప్రిన్సిపాల్‌ రవికిరణ్‌ తెలిపారు. విద్యార్థులను ప్రైమరీ ఇన్‌చార్జి అఖిల, వ్యాయామ ఉపాధ్యాయులు వికాస్‌, నవీన్‌ తదితరులు సోమవారం పాఠశాలలో అభినందించారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ఖలీల్‌వాడి: కేరళలోని వయనాడ్‌ వరద బాధితుల సహాయ నిధి కోసం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం విరాళాలను సేకరించారు. విరాళంగా సేకరించిన రూ.13,600 కేరళ సీఎం సహాయనిధికి పంపించామని పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు పెద్ది వెంకట్‌రాములు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విఘ్నేష్‌, నగర కమిటీ సభ్యులు నల్వాల నర్సయ్య, కటారి రాములు పాల్గొన్నారు.

అటవీ భూమి స్వాధీనం



సిరికొండ: రేంజ్‌ పరిధిలోని హుస్సేన్‌నగర్‌ బీట్‌లో లొంక తండావాసులు కబ్జా చేసిన అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్‌ ఎంపీ నాయక్‌ సోమవారం తెలిపారు. కంపార్ట్‌మెంట్‌ నంబర్‌ 407లోని ఐదు ఎకరాల భూమిలో చెట్లు నరికేసి చదును చేసే పనులు చేపట్టినట్లు ఎఫ్‌ఆర్వో తెలిపారు. ఆ భూమిని ధర్పల్లి సీఐ భిక్షపతి పోలీసులతో కలిసి సోమవారం అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అటవీ భూమిని ఆక్రమించిన తండావాసులపై విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని రేంజర్‌ తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిలో మొక్కలు నాటుతామన్నారు. డీఆర్వో గంగారాం, బీట్‌ ఆఫీసర్లు ఉన్నారు.

అప్రమత్తతతో ఆపద దూరం

- వానాకాలంలో రోడ్డు ప్రమాదాలు
- ఏటా మూడు నెలల్లో 10 నుంచి 15 మంది మృత్యువాత
- స్పీడ్‌ తగ్గిస్తే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చంటున్న పోలీసులు



ఖలీల్‌వాడి: వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అవుతుంటాయి. వర్షం కారణంగా వాహనాలు అదుపుతప్పి ఎంతో మంది మృతి చెందిన ఘటనలున్నాయి. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలం సీజన్‌ మూడు నెలల్లో 10 నుంచి 15 మంది మృతి చెందుతున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 6.70 లక్షల వాహనాలు తిరుగుతుండగా, ప్రతి ఏడాది 15వేలకు పైగా కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి.

ద్విచక్ర వాహన ప్రమాదాలే ఎక్కువ..

వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. త్వరగా గమ్యస్థానానికి చేరుకోవాలని వర్షంలో వాహనాలు స్పీడ్‌గా నడపడం కారణంగా ద్విచక్రవాహనదారులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. అనేక మంది ప్రమాదాలబారినపడి చికిత్స పొందారు. రోడ్లపై బురద, గుంతల కారణంగా ద్విచ్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి. వర్షాకాలంలో బైక్‌లు, ఇతర ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు 40 కిలోమీటర్ల కంటే ఎక్కువ స్పీడ్‌తో వెళ్లొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వర్షం కురుస్తున్న సమయంలో వాహనాల వేగం పెంచడం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షాకాలంలో ఆర్టీసీ బస్సులు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వెళ్లాలి. అలాగే కార్లు, ఇతర వాహనాలు 80 కిలో మీటర్ల కంటే ఎక్కువ స్పీడ్‌తో వెళ్లొద్దు. ద్విచక్రవాహనదారులు 40 కిలోమీటర్ల వేగాన్ని అధిగమించొద్దు. నాలుగు టైర్ల వాహనాదారులు ముందు ఉండే గ్లాస్‌తోపాటు వైపర్లు సరిచూసుకోవాలి. వర్షం ఎక్కువగా కురుస్తున్న సమయంలో లైట్లు ఆన్‌ చేసుకోవాలి. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు, కార్లు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్టును తప్పకుండా ధరించాలి. తప్పనిసరిగా వీల్‌ అలైన్‌మెంట్‌, బ్యాలెన్సింగ్‌ చూసుకోవాలి. దూర ప్రాంతాలకు బయల్దేరే ముందు టైర్లలో గాలి, బ్రేక్‌లు చెక్‌ చేసుకోవాలి.

స్పీడ్‌గా వెళ్లొద్దు

వర్షాకాలంలో వాహనదారులు స్పీడ్‌గా వెళ్లొద్దు. వేగం కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. వాహనాల కండిషన్‌ను చూసుకోవాలి. కార్లు, ఇతర వాహనదారులు సీట్‌బెల్ట్‌ ధరించడంతోపాటు బ్రేక్‌లు, వైపర్లు, ముందుగ్లాస్‌, సైడ్‌ మిర్రర్లు, లైట్లు మంచిగా ఉంచుకోవాలి.

– నరహరి, పట్టణ సీఐ, నిజామాబాద్‌

వామపక్షాల మధ్య ఐక్యత పెరగాలి

- కుల, మతాల పేరుతో ప్రజలను విడగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ

ఖలీల్‌వాడి: వామపక్షాల మధ్య ఐక్యతను మరింత పెంచుకోవడంతోపాటు ప్రజాస్వామ్య శక్తులను కలుపుకుని ముందుకు వెళ్లాలని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని మర్చంట్‌ అసోసియేషన్‌ హాలులో పార్టీ రాష్ట్ర నాయకుడు కంజర భూమయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు పద్మ హాజరై మాట్లాడారు. ప్రజల హక్కులను కాలరాస్తూ పెట్టుబడిదారులు, కార్పొరేట్‌ కంపెనీల అడుగుజాడల్లో పాలన కొనసాగిస్తున్న ఎన్డీఏకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలను ఏకం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్డీఏ అరాచకాలను అర్థమయ్యేలా వివరించాలన్నారు. స్వతంత్రంగా ఉద్యమాలు, పోరాటాలు చేసే విధంగా కార్మిక, కర్షక, మహిళ, యువజన తదితర ప్రజాసంఘాల నిర్మాణాన్ని పెంచాలన్నారు. హక్కులపై గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలని, అన్ని కులాలు, మతాల వారు కలిసి బతికేలా సాంఘిక వాతావరణాన్ని సృష్టించేందుకు సమాయత్తం కావాలన్నారు. నిరుద్యోగం, అధికధరలకు వ్యతిరేకంగా ఇండియా కూటమితో కలిసి పోరాటాన్ని తీవ్రతరం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్‌, కామారెడ్డి జిల్లా కార్యదర్శి దశరథ్‌, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమయ్య, రాజన్న, విఠల్‌గౌడ్‌, రాజన్న, రాజిరెడ్డి, స్వరూపారాణి, బాల్‌రాజ్‌, పార్టీ, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు తేదీని ఈ నెల 12వరకు పొడిగించినట్లు కంట్రోలర్‌ ఎం.అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 14వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www.telanganau niversity.ac. in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

కొనసాగుతున్న పరీక్షలు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ వన్‌టైం ఛాన్స్‌ బ్యాక్‌లాగ్‌ 5, 6వ సెమిస్టర్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (ఆర్మూర్‌) పరీక్షా కేంద్రంలో సోమవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు ఒక్క విద్యార్థి హాజరైనట్లు తెలిపారు.

పీజీ బ్యాక్‌లాగ్‌..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్‌, పీజీ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో సోమవారం 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. తెయూ మెయిన్‌ క్యాంపస్‌, భిక్కనూర్‌ సౌత్‌క్యాంపస్‌, గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (నిజామాబాద్‌), ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ డిగ్రీ కాలేజ్‌ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (బాన్సువాడ)లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 1, 3, 4, 7, 9వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 179 మంది విద్యార్థులకు గాను 167 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరైనట్లు ప్రొఫెసర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు. అలాగే మధ్యాహ్నం తెయూ మెయిన్‌ క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షకు ఆరుగురు విద్యార్థులకు గాను ఆరుగురు హాజరయ్యారన్నారు.

ఎక్సైజ్‌ ఈఎస్‌పై ఏసీబీ నజర్‌?

- డిపో అనుమతి వ్యవహారంలో ఫిర్యాదులు
- సెలవుపై వెళ్లిన అధికారి
- ఇన్‌చార్జి ఈఎస్‌గా డీసీబీ నాయక్‌

ఖలీల్‌వాడి: జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డిపై ఏసీబీ నజర్‌ పెట్టినట్లు తెలిసింది. దీంతో ఈఎస్‌ నెల రోజులు సెలవుపై వెళ్లారని ఆ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డిపో ఏర్పాటుకు తాము దరఖాస్తు చేసుకోగా, ఇంతకు ముందు ఉన్న డిపో నిర్వాహకులతో ఈఎస్‌ కుమ్మక్కై తమకు అనుమతులు రాకుండా అడ్డుకుంటున్నారని, ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టారని దరఖాస్తుదారులు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది.

ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈఎస్‌ ఆస్తుల వివరాలపై ఆరా తీయడం ప్రారంభించారని, హైదరాబాద్‌లోని అతని నివాసంతోపాటు సొంత గ్రామంలో తనిఖీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈఎస్‌కు సంబంధించిన, ఆయనకు సహకరించిన సిబ్బంది వివరాలనూ సేకరించినట్లు తెలుస్తోంది.

డిపో వ్యవహారంలో ఈఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో, ఎక్సైజ్‌ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్‌ కమిషనర్‌, జిల్లా కలెక్టర్‌, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎక్సైజ్‌ శాఖలో కలకలం రేపుతోంది. ఇదిలా ఉండగా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి నెల రోజుల సెలవుపై వెళ్లినట్లు డిప్యూటీ కమిషనర్‌ సోమిరెడ్డి తెలిపారు. అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి డీసీబీ నాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

హెచ్‌ఆర్‌ఏ వద్దు.. హెడ్‌ క్వార్టర్స్‌లో ఉండను

- రూరల్‌ ఏఏవో వింత పోకడ
- జిల్లా, ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్‌



నిజామాబాద్‌నాగారం: 'విజయ్‌కుమార్‌.. ఎవరి మాటా వినడు!' అనేది జిల్లా విద్యుత్‌ సంస్థలో అందరికీ తెలిసిన విషయమైపోయింది. సాక్షాత్తు టీజీఎన్‌పీడీసీఎల్‌ సీఎండీ ఆదేశాలను సదరు ఉద్యోగి ఖాతరు చేయకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏఏవో స్థాయి ఉద్యోగి ఉన్నతాధికారులను పట్టించుకోకపోవడం సంస్థలో సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అధికారులు, ఉద్యోగులు తమకు కేటాయించిన స్థానంలో ఉంటూ విధులు నిర్వర్తించాలని సీఎండీ ఆదేశిస్తుండగా, నిజామాబాద్‌ రూరల్‌ ఈఆర్‌వో కార్యాలయంలో విధులు నిర్వహించే ఏఏవో పట్టించుకోవడం లేదు. హెడ్‌క్వార్టర్స్‌లో ఉండను.. హెచ్‌ఆర్‌ఏ తీసుకోను.. అంటూ ఇష్టారాజ్యాంగా విధులు నిర్వహిస్తున్నాడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీఎండీ ఆదేశాల ప్రకారం డివిజన్‌ పరిధిలో విధులు నిర్వహించే ఏడీఈ, ఏఈ, సబ్‌ ఇంజినీర్‌, అకౌంట్‌ సెక్షన్‌లో పని చేసే ఏవో, జేఏవో, ఎల్‌డీసీ, యూడీసీ, జేఎల్‌ఎం నుంచి ఫోర్‌మెన్‌ వరకు కచ్చితంగా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాల్సి ఉంటుంది. హెడ్‌ క్వార్టర్స్‌లో లేనివారిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయి. సదరు ఉద్యోగి వ్యవహార శైలిలో మార్పు లేనిపక్షంలో షోకాజ్‌ నోటీసు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, నిజామాబాద్‌ రూరల్‌ అసిస్టెంట్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌(ఏఏవో) విజయ్‌కుమార్‌ కామారెడ్డిలో ఉంటూ నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో నిజామాబాద్‌ ఆపరేషన్‌ డీఈగా పనిచేసిన వెంకటరమణ హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాలని విజయ్‌కుమార్‌ను పలుమార్లు హెచ్చరించగా, ఆయన వినకపోవడంతో హెచ్‌ఆర్‌ఏ కట్‌ చేశారు. రెండేళ్ల క్రితం డీఈ బదిలీ కాగా ఆయన స్థానంలో వచ్చిన డీఈ శ్రీనివాస్‌ సైతం ఏఏవో హెచ్‌ఆర్‌ఏను కట్‌ చేశారు. అయినప్పటికీ ఏఏవో హెడ్‌ క్వార్టర్స్‌లో ఉండకుండా హెచ్‌ఆర్‌ఏ తీసుకోకుండా కామారెడ్డి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. కిందిస్థాయి ఉద్యోగులు హెడ్‌క్వార్టర్స్‌లో లేకున్నా, విధుల్లో చిన్నపాటి నిర్లక్ష్యం చేసినా డీఈలు ఆగమేఘాల మీద చర్యలు తీసుకుంటున్నారని, రూరల్‌ ఏఏవో హెడ్‌క్వార్టర్స్‌లో ఉండడం లేదని, హెచ్‌ఆర్‌ఏ తీసుకోవడం లేదని తెలిసినా పట్టించుకోవడం లేదని సంస్థ ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నిజామాబాద్‌ రూరల్‌ డీఈ ఉత్తం జాడేను 'సాక్షి' వివరణ కోరగా.. తనకు తెలియదని, సర్కిల్‌ కార్యాలయంలో పూర్తి వివరాలు తెలుసుకుంటానని సమాధానమిచ్చారు.

చర్యలు తీసుకోవాల్సిందే

కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ఉద్యోగులు, అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాల్సిందే. హెచ్‌ఆర్‌ఏ తీసుకోకుండా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండను అంటే కుదరదు. రూరల్‌ ఏఏవో విజయ్‌కుమార్‌ వ్యవహారాన్ని రూరల్‌ డీఈ పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నేను సైతం పూర్తి వివరాలు తెలుసుకుంటాను.

– రవీందర్‌, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

ఏకకాలంలో రైతులకు రుణ మాఫీ చేయాలి



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్‌: జిల్లాలోని 2.75లక్షల మంది రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌ కులాచారి డిమాండ్‌ చేశారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా వర్తింపజేయాలని డిమాండ్‌చేస్తూ బీజేపీ కిసాన్‌ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినేశ్‌ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు రైతులందరికీ ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్‌ ప్రకటించిందని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు రేషన్‌కార్డు, కుటుంబం ఆధారంగా మాఫీ చేస్తోందని, తద్వారా జిల్లాలో 25శాతం రైతులకు కూడా రుణాలు మాఫీ కాలేదని తెలిపారు. రెండు విడతల్లో కలిపి జిల్లాలో 70వేల మంది రైతులకు రూ.448 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయని పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 91వేల మంది రైతులకు రూ.450 కోట్లు మాఫీ చేసిందన్నారు. జిల్లాలో సొసైటీ సెక్రటరీలు, బ్యాంకర్లు ఆన్‌లైన్‌లో అప్‌డేట్‌ చేయకపోవడంతో సుమారు 30వేల మంది రైతులు రుణమాఫీ వర్తించక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అటువంటి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

అలాగే రైతుభరోసా కింద ఎకరానికి రూ.7500 ఇస్తామని ప్రకటించి.. రెండు సీజన్లు గడుస్తున్నా.. ఇంతవరకూ రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌ పాలనలో రైతుకు భరోసా లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌ మోర్చా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి, నాయకులు పోతన్‌కర్‌ లక్ష్మీనారాయణ, రవీందర్‌ రెడ్డి, భరత్‌ భూషణ్‌, హరీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

ప్రహరీని ఢీకొట్టిన కారు



ఘటనాస్థలంలో బోల్తాపడిన కారు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఐటీఐ కాలేజీ సమీపంలో ఆదివారం రాత్రి టైరు పేలడంతో కారు ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టినట్లు ఎస్సై రామ్‌ తెలిపారు. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారని, బాధితుల ఫిర్యాద మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బాలుడి ఆచూకీ లభ్యం



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని ఇందూర్‌ ఉన్నత పాఠశాల నుంచి 10 రోజుల క్రితం కనిపించకుండా పోయిన విద్యార్థి బొంబాయి సాయిరాం ఆచూకీ లభించింది. మోస్రా మండల కేంద్రానికి చెందిన బొంబాయి సాయిరాం ఇందూర్‌ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. 10 రోజుల క్రితం సాయిరాం బయటికి వెళ్లిపోవడంతో స్కూల్‌ యాజమాన్యంతోపాటు అతడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమలకు వెళ్లిన సాయిరాం అక్కడి నుంచి తల్లిదండ్రులకు ఫోన్‌ చేయడంతో పోలీసులు అక్కడికి వెళ్లి సాయిరాంను తీసుకువచ్చారు. సాయిరాంను పాఠశాల కరస్పాండెంట్‌ కోడాలి కిశోర్‌కుమార్‌తోపాటు పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

నికాల్‌పూర్‌లో దొంగల బీభత్సం

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని నికాల్‌పూర్‌లో సోమవారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. ఊరిశివారులోని మూడిళ్ల తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. షేక్‌ రసూల్‌ ఇంటిలో నుంచి రూ.35వేల నగదు, పక్కనే ఉన్న బెల్టుషాపులో నుంచి సుమారు రూ.70వేలు విలువ చేసే మద్యాన్ని, గైని శ్రీను అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడిన దొంగలు మద్యం సేవించగా, మద్యం మత్తులో ఉన్న ఒకరు ఊరి శివారులో పడిపోయాడు. ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించిన గ్రామస్తులు చుట్టుపక్కల వెతకగా పంట పొలాల వద్ద పడి ఉన్న వ్యక్తిని పట్టుకుని గ్రామ పంచాయతీకి తీసుకొచ్చి దేహశుద్ధి చేశారు. పట్టుబడిన దొంగ ఇచ్చిన సమాచారంతో మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

వైన్‌ షాపులో షార్ట్‌ సర్క్యూట్‌

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మండలంలోని దుర్కిలో ఉన్న బాలాజీ వైన్‌ షాపులో షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.9లక్షల ఆస్తినష్టం సంభించిందని వైన్స్‌ నిర్వాహకుడు సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం వైన్‌షాపు తెరిచే సమయానికి విద్యుత్‌ వైర్లు కాలిపోయి మద్యం బాటిళ్లు దహనమయ్యాయని తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపు చేశారన్నారు.

యువతి అదృశ్యం

జక్రాన్‌పల్లి : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలో గల గాంధీనగర్‌కు చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. ఈ నెల 4న ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి బయటికి వెళ్లిపోయి తిరిగి రాలేదన్నారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నవీపేట: మండలంలోని యంచ వద్ద గోదావరిలో దూకి ఓ మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నం చేయగా, గ్రామస్తులు కాపాడారు. మండలంలోని శివతండాకు చెందిన బానావత్‌ జ్యోతి కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకుంది. నదిలో దూకేందుకు ఆమె ప్రయత్నిస్తుండగా యంచ గ్రామానికి చెందిన గుమ్ముల నరేశ్‌, ఖలీల్‌, వినోద్‌ ఆమెను కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టీ కోసం వెళ్తుండగా ఢీకొట్టిన బైక్‌

- రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): టీ తీసుకువచ్చేందుకు రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెడ్డిగారి చెన్నమ్మ(70) అనే వృద్ధురాలు మృతి చెందింది. మండల కేంద్రంలోని కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. సదాశివనగర్‌ మండలం ధర్మరావుపేటకు చెందిన చెనమ్మ కూతురు సుజాత అనారోగ్యంతో బాధపడుతూ లింగంపేటలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను చూసేందుకు వచ్చిన చెన్నమ్మ సోమవారం రాత్రి 7గంటలకు టీ తీసుకువచ్చేందుకు రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో చెన్నమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామ శివారులోని 44వ నంబర్‌ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. నిజామాబాద్‌ నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శరీరం రెండు ముక్కలైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.

రైలులో నుంచి జారిపడి..



కామారెడ్డి క్రైం: రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన తలమడ్ల– భిక్కనూర్‌ రైల్వే స్టేషన్‌ల మధ్య సోమవారం చోటు చేసుకుంది. రైలు పట్టా పక్కన మృతదేహం ఉందని సమాచారం అందడతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్సై తావ్రూనాయక్‌ తెలిపారు.

ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి ఒకరు..

మాక్లూర్‌: మండలంలోని కొత్తపల్లిలో మేస్త్రీ పని చేస్తున్న మనబోయిన నారాయణ (47) ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా నుంచి పదేళ్లక్రితం వచ్చిన నారాయణ కొత్తపల్లిలో నివాసం ఏర్పర్చుకుని చుట్టు పక్కల గ్రామాల్లో మేస్త్రీ పని చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణ సోమవారం సాయంత్రం టీతాగేందుకు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా డ్రెయినేజీలో పడినట్లు గుర్తించారు. వెంటనే బయటకు తీయగా నారాయణ అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుమారుడు నవీన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ..

నందిపేట్‌ (ఆర్మూర్‌): బీపీ, షుగర్‌ ఎక్కువై నరాలు దెబ్బతినడంతో డొంకేశ్వర్‌ మండలం అన్నారం గ్రామానికి చెందిన తోకల కిషన్‌(53) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తోకల కిషన్‌ గత వారం రోజుల క్రితం మండల కేంద్రానికి వచ్చి గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కిషన్‌ తన గదిలో అచేతనంగా పడిపోయి ఉండడాన్ని గమనించిన పక్కింటి వ్యక్తి ఫయాజ్‌ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే కిషన్‌ను స్థానిక వైద్యులకు చూపించగా వారి సిఫారసు మేరకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు తోకల సాయికుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అకౌంట్‌ నుంచి రూ.96 వేలు మాయం

ధర్పల్లి: కస్టమర్‌ కేర్‌ నంబర్‌కు ఫోన్‌ చేసిన వ్యక్తి బ్యాంక్‌ అకౌంట్‌లో నుంచి సైబర్‌ నేరగాళ్లు డబ్బులు కాజేసినట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన గంగాధర్‌ నేషనల్‌ పేమెంట్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఎన్‌పీసీఐ) కస్టమర్‌ కేర్‌ నంబర్‌ కోసం గూగుల్‌లో సెర్చ్‌ చేసి ఫోన్‌ చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి సైబర్‌ నేరగాళ్లు రూ.96 వేలు కాజేశారు. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

హత్యకేసులో జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: ఓ హత్యకేసులో కామారెడ్డి కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆగస్టు 4 న మెదక్‌ జిల్లా రామాయంపేట మండలం లింగాపూర్‌ గ్రామానికి చెందిన తుడుం రాకేష్‌ (23) భిక్కనూర్‌ మండలం బస్వాపూర్‌ శివారులో హత్యకు గురయ్యాడు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరిపారు. హత్య జరిగిన రోజు పనిమీద రామాయంపేటకు వచ్చిన రాకేష్‌ను ఓ సెల్‌ఫోన్‌ దుకాణంలో పరిచయం అయిన మహ్మద్‌ ఇమ్రాన్‌ అనే స్థానికుడు హత్య చేసినట్లు తేలింది. బైక్‌ చోరీ ఉద్దేశంతో మద్యం తాగుదామని నమ్మించి బయటకు తీసుకువెళ్లి హత్య చేసినట్లు గుర్తించి నిందితుడిని అరెస్ట్‌ చేసి కోర్టుకు హాజరుపర్చారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ కామారెడ్డి కోర్టు రెండవ అదనపు సెషన్స్‌ జడ్జి శ్రీనివాస్‌ సోమవారం తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేసిన డీఎస్పీలు లక్ష్మీ నారాయణ, నాగేశ్వర్‌ రావు, సీఐలు రాజశేఖర్‌, సంపత్‌ కుమార్‌, ఎస్సైలు రాజు, సాయికుమార్‌, సిబ్బంది రాజగౌడ్‌, రాజశేఖర్‌ గౌడ్‌, మురళి లను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.